# మల, విక్షేప, ఆవరణలు తొలగించుకోవాలి!

**అర్థబలమధికార బలంబులెల్ల**
**భక్తి ముక్తులసాధింప పనికిరావు**
**అటులె విద్యాధనముకూడ ఎన్నడైన**
**దైవబలము ఒక్కటె దరిని జేర్చు**

ప్రేమస్వరూపులైన ఆధ్యాపకులారా! విద్యార్థులారా!

చరాచర ప్రపంచము అండజ, పిండజ, స్వేదజ, ఉద్భిజ్జములని చతుర్విధ భూతములతో నిండియున్నది.

**మానవ జీవితము ఉత్కృష్టమైనది**

అండజములనగా గ్రుడ్లచే ఉద్భవించునవి. అనగా పక్షులు, పాములు, త్రేళ్లు, చేపలు, కప్పలు, క్రిమికీటకములుకూడ యీ అండజములక్రింద చేరిపోతాయి. ఈ గ్రుడ్లచే వుద్భవించే జీవులన్నీ 21 లక్షలజాతులుగా వుంటున్నవి. పిండజములనగా గర్భమునుండి వుద్భవించునవి. ఎలుక, పిల్లి, కోతి, కుక్క, మృగము, మనిషి యివన్నీ గర్భమునుండి వుద్భవించేవి. యీ భూతములు 21 లక్షల జాతులుగా వుంటున్నవి. స్వేదజములనగా చెమటనుండి పుట్టేవి. కేవలం మానవునియొక్క చెమట మాత్రమే కాదు, పశుపక్షిమృగములందుకూడ యిట్టి చెమట వుద్భవిస్తుంది. ఇట్టి చెమటద్వారా పుట్టే జీవరాసులన్నీకూడను 21 లక్షల జీవరాసులుగా వుంటున్నవి. అవియే పేను, నల్లి మొదలైనవి. ఉద్భిజ్జములనగా భూమిని పెకలించుకొని పుట్టే జీవులు. ఇవి విత్తనములనుండి పుడుతున్నవి. వృక్షములు, పంటలు యివన్నీకూడను వీటిక్రిందనే చేరతాయి. ఇవన్నీకూడను 21 లక్షల జీవులుగా వుంటున్నాయి. ఇవన్నీ చేరి 84 లక్షల జాతులుగా

sri sathyasaivachanamrutam

వ్యాపించివున్నవి. ఈ అన్ని భూతములయందు మానవ జీవితమనేది చాలా శ్రేష్ఠమైనది, వుత్కృష్టమైనది.

**మానవుని పాపకర్మలచే మల, విక్షేప, ఆవరణలనే దోషములు ఏర్పడుతాయి**

తనను తాను ఉద్ధరించుకొనుటకు మానవత్వము చాలా అనుగుణ్యమైనది. భూత భవిష్యత్ వర్తమానములను గుర్తించి వర్తించుకొనే శక్తి సామర్థ్యములను కలిగినది, ఈ మానవత్వము. అందువలననే 'దైవం మానుషరూపేణా'. దైవంకూడను యిట్టి పవిత్రమైన, ఆదర్శవంతమైన మానవత్వాన్ని ధరిస్తూ వచ్చాడు. అయితే యిట్టి తెలివితేటలు కలిగి, యిట్టి విచక్షణాజ్ఞానము వుండి, వివేకము వుండి మానవుడు తనయొక్క తత్త్వాన్ని, తన స్వరూపాన్ని గుర్తించుకోలేకపోతున్నాడు. దీనికి కారణమేమిటి? కారణములేని కార్యము జగత్తునందు జరుగుటకు వీలుకాదు. అనేక జన్మలనుండి గావించిన పాపకర్మలు, పుణ్యకర్మలయొక్క ఫలితమే వీరియొక్క అనుభూతులకు మూలకారణము. మానవుడు చేసిన సత్కర్మలచేత మనుష్యశరీరమును పొందుతున్నాడు. కాని, పాపకర్మలనే జారత్వము, చోరత్వము, అబద్ధము, క్షుద్రమైన కర్మలవల్లనే మానవునికి మలము, విక్షేపము, ఆవరణము అనేవి ఆవరించి వుంటున్నాయి.

మలమనగా అందరికి తెలిసిన విషయమే! ప్రతి మానవుడు భుజించే అనేక విధములైన ఆహారములన్నికూడను స్థూలరూపకంగా మలముగా మారుతుంది. సూక్ష్మరూపకముగా మనస్సుగా మారుతుంది. ఈ మలము మానవునియందు వుండినంతవరకు అతనికెట్టి సుఖముగాని, comfort గాని, యే విధమైన ఆనందముగాని వుండదు. దీనిని విసర్జించకుండిన చాలా బాధలకు గురికావచ్చు. అనేక రోగములుకూడను సంభవించవచ్చును. అందువలననే మలబద్ధమైన వారు ఎనీమా అని చేయించుకుంటూ వుంటారు. ఏదో ఒక విధముగా దీనిని బలాత్కారంచేతనైనా బయటకు లాగి వేయాలి. అదే విధముగనే మనసుకు పట్టిన మలాన్నికూడను మనం విసర్జించాలి. ఈ మలము యేమిటి? అనేక జన్మలుగా మనం ఆచరించిన దుష్కర్మలయొక్క ఫలితము. అదే జారత్వము, చోరత్వము, అసత్యము, క్షుద్రకర్మలు. ఈ దుష్కర్మల ఫలితముచేత మానవుడు తన

sri sathyasai vachanamrutam

స్వరూపాన్ని తాను తెలుసుకోలేని స్థితికి అవి గొనిపోతున్నాయి. దీనికో చిన్న కథ.

**మలము పరులకు హింసగావించే పాపవృత్తులలో ప్రవేశపెడుతుంది**

ఇద్దరు మిత్రులు యేదో ఒక పనిమీద గ్రామాంతరము వెడుతూ దట్టమైన అరణ్యములో ప్రవేశించారు. అదే అడవియందు వీరికి పూర్వము ఒక వజ్రాల వర్తకుడు మహారాజువద్ద కొన్ని వజ్రములను తాను వెలకుతీసుకొని, ఆనాడు కార్లు, బస్సులు లేవు కనుక గుఱ్ఱముపైన ప్రయాణమై అతి వేగముగా తన గృహాన్ని చేరుకోవాలని పోతున్నాడు. ఆ గుఱ్ఱముయొక్క వేగముచేత ఒక డైమండ్‌మూట ఆ అడవియందు జారిపడింది. ఆ తరువాత యీ యిద్దరు మిత్రులు వెళ్లారు. ఆయిరువురు యేదో గ్రామాంతరము వెడుతున్నారు. ఈ మిత్రులు యెలాంటివారు? దేహములు వేరైనా, ఒక్క ప్రాణముగా వుండేవారు. అంత సన్నిహిత ప్రేమతత్త్వాన్ని వారు పెంచుకున్నారు. ఒకరిని వదలి ఒకరు ఒక్క క్షణమైనా వుండేవారు కాదు. ఆ యిరువురుకూడ యీ మూటను చూశారు. ఒక మిత్రుడు యీ మూటను విప్పాడు. విప్పేటప్పటికి అతి ప్రకాశవంతముగా మెరుస్తున్న వజ్రాలను చూశారు, ఈ మిత్రులిద్దరు. తక్షణమే ఒక మిత్రునికి ఒక విధమైన దుర్భావము కలిగింది. యిదే మలముయొక్క reaction. రెండవ మిత్రునితో చెప్పాడు: "మిత్రమా! నీవీ మూటను తీసుకొని ఒక చెట్టు క్రిందకూర్చో. మనకు ఆకలి వేస్తున్నది. నేను యీ దగ్గరలోవున్న పట్టణానికి వెళ్లి కొంత పెరుగన్నము, పులుసన్నము పొట్లములు కట్టించుకొని తెస్తాను. మనమిద్దరము భుజించి నిదానంగా రాత్రి అయ్యేటప్పటికి గ్రామాన్ని చేరుకుంటాము" అన్నాడు. రెండవ మిత్రుడు 'మంచిది అన్నా!' అన్నాడు. ఒక చెట్టుక్రింద భద్రముగా యీ మూటను కాపాడుకుంటూవున్నాడు. ఈ ఆహారాన్ని తీసుకురావటానికి పట్టణానికి వెళ్లిన వ్యక్తికి క్రమక్రమేణా, క్షణక్షణమునకు దుర్భావములు, దుర్బుద్ధులు హెచ్చవుతూ వచ్చాయి. ఒక హోటలుకు వెళ్లాడు. పులుసన్నం ఒక ప్యాకెట్టు, పెరుగన్నం ఒక ప్యాకెట్టు తీసుకున్నాడు. అక్కడనుండి నేరుగా ఒక మెడికల్ షాపుకి వెళ్లాడు. అక్కడకుపోయి 'మంచి strong poison కావాలి నాకు', అన్నాడు. ఈనాటివలె ఆనాడు యీ మెడిసిన్స్‌కు కంట్రోలు లేదు. అలాంటి సమయములో వాడు అడిగినది యిచ్చారు. మధ్య మార్గంలో యీ పులుసు అన్నంలో

srisathyasai vachanamrutam

కొంచెం, పెరుగు అన్నంలో కొంచెం కలిపి మళ్లీ అవి pack చేసుకొని మిత్రునికివ్వటానికి వస్తున్నాడు. వీనియొక్క మలము వీనినీ రీతిగా బాధిస్తుండగా చెట్టుక్రింద కూర్చున్నవానికి మరింత కఠినమైన దుర్భావములు ఆరంభమైనాయి. 'నేను తిన్నగా గ్రామం వెళ్లిపోతే యే నాటికైనా వాడు తిరిగి గ్రామం చేరవచ్చు. గ్రామంచేరిన తరువాత నాకీ వజ్రాలు చిక్కిన సంగతి గ్రామమంతా చాటవచ్చును. కనుక వీడెట్లైనా లేకుండా చేయాలి. వీనినేరీతిగానైనా పొడిచి చంపాలి', అనే దుర్భావము వానిలో ప్రారంభం అయింది. 'వాడు కనుక చనిపోతే యీ డైమండ్సు అన్నీ నాకే దక్కుతాయి', అనేస్వార్థం బయలుదేరింది. ఈ వచ్చిన మిత్రుడు అతిప్రేమతో 'తమ్ముడూ! యిదిగో నీకోసం వంటలు తెచ్చాను. నీవు భుజించు. నేను యీ చెట్టువద్ద కూర్చుని వీనిని కాపాడతాన'ని ఆ packet తీసుకొని విప్పుతూ వీనికి అన్నం పెట్టాడు. వీడేమీ అన్నం తినలేదు. తినకుండా యేమి చేశాడు. వాడిట్లాక్రిందకు చూస్తున్న సమయంలో కత్తి తీసుకుని మెడపై వేసి చంపేశాడు. వాడు క్రిందపడి ప్రాణం విడిచాడు. ఇంక నా బంధన పోయిందనుకున్నాడు. వీడప్పుడు చక్కగా ఆ పెరుగన్నము, పులుసన్నం తిన్నాడు. తినిన కొన్ని నిముషాలకు వీడు ప్రాణం విడిచాడు. ఈ మలమనేది యెంతటి ధనవంతుడినైనా. ఎన్ని విధములైన విలువైన వస్తువులు లభించినా వానిని దక్కించుకునే శక్తిసామర్థ్యములు కోల్పోటమే కాకుండా పరులకు తిరిగి యీ మలముచేత హింసగావించే పాప వృత్తులలో ప్రవేశ పెడుతుంది. కడపటికి యింత విలువైన వజ్రములు లభించికూడను యిరువురునూ దక్కించుకోలేకపోయారు. కడపటికి, అవి యెవరికో లభించి వారిద్వారా ప్రభుత్వానికి చేరిపోయాయి.

కనుక, మానవునియందుండిన అనేక జన్మలనుండి వెంటాడుతున్న యీ దుర్గుణములు, దుర్భావములు, దుశ్చేష్టలు అనేవి నిర్మూలం గావించుకోవాలంటే నిరంతరము దైవచింతన చేయాలి. దైవ భావముతో నింపాలి. దైవమును ప్రార్థించాలి. చింతించాలి. ఆరాధించాలి. అనుభవించాలి. అదే మానవునియొక్క మతము. ఈ Religion అంటే యేమిటి? Realisation is religion. Realise చెయ్యాలి. తానెవరో తెలుసుకోవాలి. అలా తెలుసుకోటానికి నిరంతరము మనం యేమి చెయాలి? ప్రతి విషయంలోను మనము దైవత్వాన్ని పొందటానికి తగిన ప్రయత్నంచేయాలి. Man must realise God. Feel God.

sri sathyasai vahanamrutam

See God. Enjoy with God. Talk with God. That is real religion. ఈ మతాన్ని మనం బోధించుకోటానికి, యీ మతాన్ని మనం అనుభవించుకోటానికి, యీ మతాన్ని మనం అభివృద్ధి గావించుకోటానికి దైవత్వాన్ని పొందాలి. అప్పుడే యీ మలము అన్నివిధాలా నిర్మూలమైపోతుంది. ఏ జన్మలో చేసిన పాపఫలమో తిరిగి యీ జన్మలోకూడను తిరిగి పాపములే చేస్తుంటే యిది పర్వతాల మాదిరి పెరిగిపోతుంది. ఈ పాపములింక క్షీణించటానికి వీలుకాదు. మనజన్మ సార్థకముకాదు.

**విక్షేపమనగా నిరంతర చంచలత్వము**

ఇంక విక్షేపము. విక్షేపమనగా నిరంతరము చంచలత్వము. అనగా మనసు, శరీరము రెండుకూడను నిరంతరము కదలుతూనే వుంటాయి. శరీరము కదిలిందంటే మనసుకూడను కదలుతుంది. ఈ టంబ్లరు కదిలిందంటే లోపల నీళ్ళుకూడా కదులుతాయి చూడండి! ఈ టంబ్లరు స్టడీగా వుంటే దానిలో నీరుకూడ స్టడీగా వుంటుంది. మన శరీరము ఒక పాత్రవంటిది. దీనినే ఘటమంటారు. ఇది యిష్టమొచ్చినట్లు కదలుతూపోతూవుంటే, మైండ్ మరింతకోతి. దాని చంచలత్వము మరింత అధికమైపోతుంది. ఈ విక్షేపాన్ని దూరంచేసుకోవాలంటే మనము దేనిపైననైనా ఏకాగ్రత అభివృద్ధి చేసుకోవాలి.

దీనికొక చిన్న కథ. రామకృష్ణ పరమహంస, రాణీ రాసమణి యింట్లో దేవీ పూజ చేసుకుంటూ వుండేవాడు. రామకృష్ణుడు చక్కగా పాడేవాడు. అతని గాత్రం చాలా మధురంగా వుండేది. ఒకనాడందరు కూర్చొని, రామకృష్ణుడేదో పాడుతూ వుండే సమయంలో, అక్కడ మథురనాథుడుకూడా వున్నాడు. మథురనాథుడనగా రాణి రాసమణి అల్లుడు. ఆ సమయంలో రాణి రాసమణి ప్రార్థించింది, "రామకృష్ణా! నీ గానము చాలా ఆనందముగా వుంటుంది. మరొకతూరి పాడి నన్ను ఆనందపెట్టు" అన్నది. కనులు మూసుకున్నాడు. హాయిగా భగవత్ ధ్యానములో నామ స్మరణ ప్రారంభించాడు. ఈ రాసమణి, మిగిలిన అక్కడ చేరిన వ్యక్తులందరుకూడను తలలూపుతూ తాళాలు వేస్తూ, అన్ని విధాలా ఆనందాన్ని నటిస్తూ వచ్చారు. తక్షణమే రామకృష్ణుడు పాటను ఆపివేసి ఒక్కసారిగా రాణి రాసమణి దగ్గరకు వచ్చి బలంగా చెంపపైన బాగా వడ్డించాడు. దెబ్బ కొట్టాడు.

srisathyasaivachanamrutam

అందరూ చాలా ఆశ్చర్యపడ్డారు. ఏమిటి! యీమె రాణి! ఈమె చేతిక్రింద పని చేసే ఈయన, ఈమె కింత punishment యిస్తున్నాడే, యేమికారణం? ఎందుకోసం? ఈయనకి మధ్యమధ్య యేమైనా పిచ్చి యెక్కుతుందా? ఏమిట"ని యోచిస్తూ వచ్చారు. వారెవరు అడగక పూర్వమే రామకృష్ణుడు జవాబు చెప్పాడు. "నీవు కూర్చోటము సత్సంగములో. నీవు ప్రార్థించినది గానము చేయమని. నీవు ఆనందించినట్లుగా నటిస్తున్నావు. కాని, నీ మనసు హైకోర్టులో వున్న ఒక కేసు విచారణపై లగ్నమై వుంది. మనిషి యిక్కడ, మనసక్కడ! Body is present. Mind is absent. ఈ విధమైన సంఘంలో నువ్వెందుకు కూర్చున్నావు? నువ్వు బయటకు వెళ్లిపో!" అని ఖండించాడు. అప్పుడు రాణి రాసమణి తన దోషము గుర్తించుకొని, "స్వామీ! యీయొక్క విక్షేపానికి మీరు కొట్టిన చెంపదెబ్బయే సరైన మందు" అని ఆనందించింది. అదే విక్షేపముయొక్క దోషము. కూర్చోటం భజనలో. చేసేది భజన చేసినట్లుగా వేసేది తాళాలు, ఎక్కడెక్కడో ఆలోచనలు చేసుకోటం, ఎక్కడెక్కడో చేష్టలలో మనం మునిగిపోటం. ఈ రకముగా వుండటమనేది విక్షేపముయొక్క పాపఫలము.

మరొక ఉదాహరణ. ఒక లాయరు ఉండేవాడు. చాలా పేరు పొందిన లాయరు. ఆయనింటికి అనేకమంది క్లయింట్లంతాకూడా యెప్పుడూ రావటం, పోవటం జరుగుతూవుండేది. ఏదో అర్జంటు కేసుపైన యెవరో వచ్చారు. ఆ సమయములోపల యీ లాయరు పూజరూములో కూర్చున్నాడు. ఓం నమఃశివాయ అనుకుంటూ పూజలు చేస్తున్నాడు. దానికి పూర్వము కొంచెం ముందుగా కోడలును పిలచి యేదో చెప్పాడు. ఇంతలోపల క్లయింట్లు వచ్చి 'అమ్మా మీ మామగారు యెక్కడవున్నార'ని ప్రశ్నించారు. ఈ కోడలు చాలా చురుకైన కోడలు. మామగారికి వినిపించేట్టుగా 'మా మామగారు హరిజనుల యింట్లో కూర్చున్నారు' అంది. ఈ మాట విన్నాడు లోపలవున్న మామ పరుగెత్తి వచ్చాడు. 'ఏమే నీకు బుద్ధి వుందా లేదా? నేను పూజ రూములో కూర్చొని వుంటే, హరిజనుల యింట్లో కూర్చున్నానని జవాబు చెబుతున్నావే' అని గట్టిగా కోప్పడ్డాడు. ఈయన నమఃశివాయ, నమఃశివాయ అని పూజచేస్తూ 'చెప్పులు కుట్టడానికి ఇచ్చి ఆరుదినాలైంది. వాడింకా కుట్టలేదు. ఎందుకోసం వాడింకా తేలేదు? ఈ తూరి వాడు రానీ, వాని వీపు పగలగొడతాను', అని అనుకుంటూ మధ్య మధ్య నమఃశివాయ, నమఃశివాయ



sri sathyasai vahini amrutam

అంటున్నాడు. అంతకుముందు ఆ సంగతే ముందుగా కోడలికి చెప్పాడు, 'చెప్పులు తెస్తే వాడిని వుండమని చెప్పు. నేను వచ్చి వాడిని కోప్పడతానని'. కోడలు యీ సంగతి తెలుసుకొని పూజరూములోకి పోయి చెప్పులగురించి యెందుకు విచారించటం అనుకుని 'వుండటం పూజరూములో', కాని బుద్ధి చెప్పులు కుట్టే వాని యింట్లో వుంద'ని కరెక్టుగా చెప్పింది. అనగా చేసేది ఒక పనిగా వుండినప్పుడు ఈ పనిలో పూర్తిగా లీనమై మనం చేయాలి. కాని దానిని వదలి అనవసరమైన విషయాలలోకి పోవటం, యిది విక్షేపముయొక్క మహత్యము. కనుక విక్షేపమనేది యెప్పుడు చూసినాకూడను మనసు, శరీరము కదలుతూ వుంటుంది. మనసు కోతికంటె హీనమైన మనసుగా తయారవుతుంది.

**దేహభ్రాంతిచేత స్వస్వరూపమును గుర్తించుకోలేకపోవటమే ఆవరణ**

ఇంక ఆవరణము. ఈ ఆవరణమనగా యేమంటే మనలనావరించివుండేది. 'నేను విద్యార్థిని, నేను ఉపాధ్యాయుడును, నేను బ్రాహ్మణుడను, నేను క్షత్రియుడను, నేను స్త్రీని, నేను పురుషుడను', ఈ విధముగా కొన్ని విధములైన భావములు మనల్ని ఆవరించటమే! కేవలం యీ శరీరము నేననే అజ్ఞానంచేతనే వీడు యీ విధమైన విభాగములు చేస్తూ వున్నాడు. ఈ student యెవరు? దేహాన్ని బట్టి నువ్వు student అంటున్నావు. ఒకరు నేను టీచరును అనుకుంటున్నాడు. నీ దేహతత్వాన్ని బట్టి నీవు టీచరు అనుకుంటున్నావు. నేను బ్రాహ్మణుడను, నేను క్షత్రియుడను, నేను శూద్రుడను, నేను పురుషుడను, నేను స్త్రీని, నేను యవ్వనుడను, నేను వృద్ధుడను అని యీ రకంగా అనుకోటం కేవలం దేహభ్రాంతిచేతనే! దాని వలననే యీ భావాలన్నీ మానవుని ఆవరిస్తూ వస్తున్నాయి. ఆత్మ రీతిగా చూస్తే నీవు బ్రాహ్మణుడవుకావు. శూద్రుడవుకావు. యవ్వనుడవు కాదు, వృద్ధుడుకాదు, స్త్రీకాదు, పురుషుడుకాదు, టీచరుకాదు, విద్యార్థికాదు. దేహభ్రాంతిని వుంచుకోటంచేతనే మనము స్వస్వరూపానికి దూరమైపోతున్నాము. దానిని దర్శించుకోలేకపోతున్నాము. మానవుడు తనను తాను తెలుసుకోలేకపోతున్నాడు. కనుకనే యెవరొచ్చినా who are you? అంటే I am so and so అని దేహానికి సంబంధించిన పేరు, రూపాన్ని చూపిస్తూ వుంటాడు. మానవుడు తన యథార్థాన్ని, తన సత్యాన్ని, తన స్వరూపాన్ని గుర్తించుకోలేక పోవటానికి

sri sathyasai vahanamrutam

కారణము యేమిటి? మహాపాపఫలితమైన మలము. అనగా దుర్బుద్ధులయొక్క ఫలితము. తర్వాత చంచలత్వముచేత తన స్వరూపాన్ని తాను గుర్తించుకోలేక పోతున్నాడు. ఈ దేహభ్రాంతి అనేది ఆవరించటంచేతనే, యీ ఆవరణచేతనే తన స్వస్వరూపాన్ని తాను గుర్తించుకోలేకపోతున్నాడు. కనుక సత్యాన్ని గుర్తించవలెనంటే మొట్టమొదట మలాన్ని దూరం చేసుకోవాలి. అనగా దుర్భావములు, దురాలోచనలు, దుర్గుణములు యెన్నో జన్మలనుండి వచ్చినవి. యీ జన్మలోనైనా యిలాంటి దుర్భావములు, దురాలోచనలు, దుశ్చేష్టలు లేకుండా దానిని భగవచ్చింతనచేత పరిహారం గావించటానికి ప్రయత్నించాలి.

### తన ఇంద్రియాలను తాను control చేసుకున్నవాడే master

ధ్యానము, జపము, భజన యిత్యాది పవిత్రకార్యములు, కర్మలచేత మనలో యేకాగ్రతను పెంచుకోవాలి. ఈ విధమైన రీతిలో చేస్తున్నప్పుడు మనకు క్రమక్రమేణా యీ దేహముపై వుండే భ్రాంతిపోయి 'సర్వకర్మ భగవత్ ప్రీత్యర్థం'. అనే అర్పణభావము మనలో ప్రారంభమౌతుంది. ఈ పవిత్రకర్మలు, తద్వారా విమోచనలేకుండిన, మానవ జీవితమే దుర్వినియోగమవుతుంది. బంధనలో చిక్కుకొని భ్రష్టుడై పోతాడు. మానవుడు మొట్టమొదట తనయొక్క సత్యాన్ని గుర్తించుకొని, తనయొక్క స్వరూపాన్ని దర్శించుకోటానికి తగిన కృషి చేయాలంటే దుర్బుద్ధులు మానుకోవాలి. దుశ్చేష్టలు వదలుకోవాలి. దుశ్చర్యలన్నీ స్తంభించిపోవాలి. మనలో తప్పులు లేకుండా చూసుకోవాలి. మన తప్పులను మనం చూసుకోవాలి గాని punishment యెలాంటిది అని మనం పరిశీలించకూడదు. అరే! చిన్న తప్పుకు ఇంత పెద్ద పనిష్మెంటా అని గొప్ప విజ్ఞానివలె మనం విచారిస్తూ వుంటాము. ఇది అజ్ఞానముయొక్క దోషము. అసలు తప్పు చేయటమే పెద్ద తప్పు. ఆ తప్పుచేసిన వానిని "నీవు తప్పు చేసినావు కాబట్టి పెద్ద punishment, చిన్న punishment. నీవు తప్పుచేయకుండావుంటే punishment లేదు. ఈ తప్పులు లేకుండా చూచుకో"మని మందలించాలి గాని, చిన్న తప్పుకు పెద్ద punishment అని తెలివితేటలు కల పెద్దలవలె మనం భావించటము పరమ అజ్ఞానము. తెలుగులో చెప్తారు, "చిన్న పామునైనా పెద్దకఱ్ఱతో కొట్టాలని". చిన్న తప్పైనా పెద్ద దెబ్బ కొట్టాలి. అప్పుడే వాడు పెద్ద తప్పులు చేయటానికి



sri sathyasai vachanamrutam

పూనుకోకుండా వుంటాడు. కాని, యింతటి విజ్ఞానుడీనాడు లేడు. అజ్ఞానులతో అజ్ఞానులుగా చేరిపోయి మరింత అజ్ఞానము పెంచుకోటంచేత తప్పులు మితిమీరి పెరిగిపోతున్నాయి. యీ పెద్దలవల్లనే పిల్లలుకూడా మరింత మితిమీరి పోతున్నారు. భజనలోకూర్చుంటారు. ఎక్కడైనా కాని భజన భజనే! మందిరంలో చేయి భజనే, Institureలో చేయి భజనే, Hostelలో చేయి భజనే; ఎక్కడైనా భజన పవిత్రమైనది. ఆ సమయములో యెందుకు మనం disturbedగా వుండాలి? ఎందుకు మనమీవిధంగా కోతి చేష్టలు చెయ్యాలి? కదలటము, దగ్గటము, యింకా పిచ్చి పిచ్చి నవ్వులు నవ్వటం. ఇది నిజంగా స్వామిపైన ప్రేమ, విశ్వాసము వున్న వ్యక్తులు చేయవలసిందేనా? కాదు, కాదు. ఇది స్వామిపైన ప్రేమ, విశ్వాసము లేనివారు చేసే పని. వున్నట్టుగా నటిస్తూ వుంటారు. అది వారు నమ్మవచ్చు. నేను నమ్మను. నిజంగా భక్తి, విశ్వాసము వున్న వానికి యీ చేష్టలు రానే రావు. మనం భజనలో కూర్చున్నప్పుడు, పవిత్రమైన దీనిలో వున్నప్పుడు, మనసును స్తంభింపజేసి దైవ చింతనలోనే మునిగిపోవాలి. కనీసం ఆ రకమైన దానికి ప్రయత్నం అన్నా చేయాలి. నీకు యిష్టంలేకపోతే ఊరకే కూర్చో. నీకేది యిష్టమో దానిని స్మరించుకుంటూ కూర్చో. అంతేకాని దగ్గటం యిలాంటివన్నీ చేస్తే యిది రౌడీలు చేసినట్లుగా వుంటుంది. ఇది మన విద్యార్థులకు వికారమైన బుద్ధులేకాని సద్బుద్ధులు కానేరవు. భజనలో కూర్చుంటారు. ఎప్పుడు చూచినాకాని కదలుతూ దృష్టినంతాకూడా distrub చేస్తుంటారు. ఎందుకు కదలాలి? నీకా మాత్రం స్థిరత్వం లేదా? ఈ వయసులోపల మీయొక్క శరీరాన్ని మీరు యింతమాత్రము control చేయలేకపోతే మీరు slaves, not masters. తన యింద్రియాలను తాను control చేసుకున్నవాడే master. తనదేహాన్ని తాను అదుపులో పెట్టుకున్నవాడే master. తనబుద్ధిని సరైన స్థితిలో పెట్టుకున్నవాడే master. లేకపోతే sensesకి slave, bodyకి slave, బుద్ధికి slave. ఇంకా వీడు complete జగత్తుకు ఒక slave అయిపోతాడు. కనుక, మీరు masters కావాలిగాని slaves కారాదు.

**విజ్ఞాన, వివేకములతోకూడిన వాతావరణము సర్వత్ర వ్యాపించాలి**

యిది యెక్కడ ప్రారంభం కావాలంటే, పిల్లలందరు యెక్కడ చేరుతున్నారో అక్కడే,

sri sathyasai vachanamrutam

అంటే Hostelలో ప్రారంభం కావాలి. నిజముగా Hostelలో క్రమశిక్షణ సరిగ్గా వుంటే యీ యొక్క భజనలో గాని, Instituteలో గాని యేరకంగా చలించటానికి అవకాశమే లేదు. కనుక, యీ యొక్క discipline మొదట Hostelలోనే చెడిపోతోంది. నేనుకూడను ప్రశాంతిమందిరంలో భజనకు వచ్చినప్పుడు చూస్తూవుంటాను. అక్కడకూడా కొందరు భజనలో ముందు కూర్చొని వుంటారు. ఆడవాళ్లంతా వుంటారు. నవ్వటం, మాట్లాడటం, కదలటం యీ విధముగా కోతులకంటే హీనంగా ప్రవర్తిస్తూ వుంటారు. కనుక హాస్టలులో మీరు స్టెడీగా వున్నప్పుడే Instituteలో స్టెడీగా వుండవచ్చు. ఇక్కడ మీరు స్టెడీగా వున్నప్పుడే మందిరంలోకూడా స్టెడీగా వుండవచ్చు. హాస్టలులో మొదట చెడిపోతున్నారు. అందరు పిల్లలతోపాటు పెద్దలుకూడా నవ్వటం, మాట్లాడుకోటం యిదంతా మొదట హాస్టల్‌లో discipline లేకుండా పోయింది, ఏదో మీరు Hostelలో వున్నామని భ్రమిస్తున్నారు. కాని, యిది పూర్తిగా మూర్ఖత్వము. అన్ని విధాలా సరైన పిల్లలుగా తయారుకావలసింది హాస్టలులో. ఇది కేవలం దిక్కులేని హాస్టలుగా తయారౌతోంది. తప్పుకు తగిన punishment లేకుండాపోతోంది. అక్కడక్కడ ఒకరితో ఒకరు పోట్లాడుకున్నా చర్య తీసుకోటంలేదు. వీరు చచ్చినారా, బ్రతికినారా! దీనికెందుకు action తీసుకోకూడదు? నేను చదువుకోసం Institute స్థాపించలేదు. Discipline కోసం చేశాము. ఇంకే విధముగా డబ్బుకోసం దీనిని మేము స్థాపించలేదు. అందువల్లనే ఒక్క నయాపైస మేము ఫీజు తీసుకోటంలేదు. స్కాలర్‌షిప్‌లంతా యిచ్చి వీళ్లకు కూడుబెట్టి, బట్టలిచ్చి పోషించి యింతచేస్తే యిలాంటి వాళ్లనెందుకు punish చేయకూడదు తప్పుచేస్తే? ఈ విధంగా ఒక్క తప్పును మనం క్షమించుకుంటూపోతే అనేక తప్పులుగా బయలుదేరిపోతున్నాయి. అక్కడవుండే పెద్ద దోషం యిది. ఈనాడు చిన్న దోషముగా ప్రారంభమవుతుంది. క్రమక్రమేణా ప్రాణం తీసే దోషముగా బయలుదేరుతుంది. అప్పుడా మనం చర్య తీసుకోటం? అప్పటికి వీళ్ల ప్రాణంకూడా పోయేవుంటుంది. కనుక Instituteలో క్రమక్రమేణా కొన్ని ఖచ్చితమైన పద్ధతులు పెట్టితీరాలి. ఉన్నవారు వుండవచ్చు. పోయేవారు పోవచ్చు. పదిమంది పిల్లలు మాకు చిక్కినాచాలు. ఈ discipline లో యే ఒక్క దానిలోనైనా యీ వయసులో మీరిపోయిందంటే యింక తరువాత వీళ్లు లొంగరు. కనుక, యీ మానవత్వం

sri sathyasai vachanamrutam

విశిష్టమైనదని నిరూపించే చర్యలలో మనము ప్రవేశించాలి. 'జంతూనాం నరజన్మ దుర్లభం'. ఎందుకోసం యీ నరజన్మ దుర్లభం? జంతువులవలె మనముకూడా ప్రవర్తిస్తే యింక నరజన్మ దుర్లభం అనే దానిలో విశిష్టత యేమిటి? కనుక, యేకొంతమందియైనాకూడను చక్కని ఆదర్శవంతమైన విద్యార్థులుగా తయారుచేసే Instituteగా తయారుకావాలియిది. విజ్ఞానవివేకములతోకూడిన వాతావరణము యిందులో సర్వత్రా వ్యాపించి పోవాలి. విద్యార్థులు యెక్కడికి పోయినప్పటికిని వారి discipline స్టెడీగా వుంటుండాలి. ఈ స్టెడీనెస్ లేకపోతే యింక యెందుకోసం యీ జీవితము? ఎందుకోసం యీ చదువులు? play groundలో వున్నా అక్కడకూడా మనము మన శరీరాన్ని సరైన రీతిలో అదుపులో పెట్టుకోవాలి. బజారులో వున్నా మీయొక్క discipline అక్కడకూడా వుండాలి. కేవలం ఒకచోట మాత్రం వుండి రెండవ చోట లేకుంటే యేమి ప్రయోజనము? Circusలో వుండే animal ఫీట్సు చేసినప్పుడు చాలా disciplineగా వుంటుంది. చాలా controlగా వుంటుంది. అందువలన, మనకంటె animal better కదా! యీ Instituteలో నేర్పేది circus కాదు, సద్గుణములు.

**యూనివర్సిటీలో వివిధ డిపార్టుమెంటులు, కమిటీలు పెట్టుకుని అవసరాలకు తగినట్టుగా ప్రపోజల్స్ పెట్టి డబ్బు తీసుకోవాలి**

కనుకనే ప్రత్యేకమైన కొన్ని కమిటీలు పెట్టి దీనిని సరైన మార్గములోనికి త్రిప్పటానికి ప్రయత్నం చేయాలి. దీనికి department committee అని ఒకటి వుండాలి. అనగా Physics, Chemistry, Botany, Mathematics, English యింకా యిలాంటి subjects అన్నిటికి ప్రత్యేకముగా కొన్నికొన్ని కమిటీలు పెట్టాలి. ఈ కమిటీలలోపల మనం చేయవలసిన పని యేమంటే పిల్లలను వారియొక్క భవిష్యత్తులో యేవిధంగా వారిని తయారుచెయ్యాలి? వాళ్ల మార్గం యేవిధంగా మనం మార్చాలి? వాళ్లకేవిధముగా మనం బోధన చెయ్యాలి? ఏవిధముగా టెస్టులు పెట్టాలి? ఏ విధముగా సరైన మార్గములోకి తెప్పించాలనే విషయాలను వీరు చక్కగా చర్చించాలి. విద్యార్థుల పురోభివృద్ధిని కోరే తత్వంలో యీ టీచర్సు అంతా దీనిని ప్రయత్నపూర్వకంగా సాధించాలి. నేను చెప్పిన పాఠం

srisathyasaivachanamrutam

పిల్లలు సరిగా అర్థం చేసుకున్నారా? లేదా? మధ్యమధ్యలో పాఠం అయిన వెంటనే వాళ్లను questions అడగాలి. దానినే slip test అంటారు. మధ్యమధ్యలో quiz పెట్టాలి. వాళ్లకు యే విధముగా అర్థం అవుతుందో, తెలియని విషయాలను పిల్లలకు చెప్పి ఎవరైనా కాని సరిగ్గా జవాబు చెప్పేటట్లుగా వారికి ట్రైనింగ్ యివ్వాలి. ఆ డిపార్టుమెంటుకు తగిన రీతిగా నోటుబుక్కులు యే రీతిగా వుంచుకుంటున్నారు అని check చెయ్యాలి. ఈ విధంగా ఆయా డిపార్టుమెంటులు ప్రత్యేక కమిటీలు పెట్టుకొని యివి క్రమేణా పిల్లలయొక్క పురోభివృద్ధికి తగిన వుత్సాహప్రోత్సాహములను అందించే విషయాన్ని మనము తెలుసుకోవాలి.

తరువాత రెండవది. Faculty committee. అనగా అన్ని subjects వారు చేరాలి. Physics వారు చేరవచ్చు. Mathematics వారు చేరవచ్చు. Chemistry వారు చేరవచ్చు. Bio science వారు చేరవచ్చు. అందరు చేరి అక్కడ వుండే ఒక్కొక్క ప్రొఫెసరు, డీను యిందులో చేరి క్రమేణా దీనిని కొంతవరకు విచారణ చెయ్యాలి. ఇందులో చాలా విచారించవలసిన విషయములు గుప్తంగా వున్నాయి. ఇప్పుడు PCM. Physics, Chemistry, Mathematics యిదొక Group. ఒకనికి Physics లో మాత్రం 80% మార్కులొచ్చాయి. Chemistryలో 18% Mathsలో 20% వస్తే వీడెలా pass అవుతాడు? "ఒక subjectలో మంచి high మార్కులు వచ్చి మిగతా subjectsలో తగ్గిపోతే వీడెట్లా పాసౌతాడు? ఎందుకోసం తగ్గింది", అని యీ టీచర్సు విచారణ చేసి, కారణములేమిటో కనుక్కొని అన్ని సబ్జక్టులోను మార్కులు సమానముగా వచ్చేటట్లుగా ప్రయత్నంచేయాలి. కనుక, యీ కమిటీలో Physics teacher వుండాలి. Mathematics teacher వుండాలి. Bioscience teacher వుండాలి. Chemistry teacher వుండాలి. అందరూ చేరితే కాని యీ balance తేవటానికి కుదరదు. ఈవిధంగా విద్యార్థులను సరిదిద్దేలోపల teachers కు యే విధమైన స్వార్థము, స్వప్రయోజనము, రాజకీయములు, అహంకారము మొదలైనవి యేమాత్రము ఉండకూడదు. కేవలం Physicsలో మంచి మార్కులు వచ్చాయి. అది నా subject అని అతను అహంకారిగా పోకూడదు. అది నీ సబ్జక్టో లేక studentయొక్క యింటరెస్టో చెప్పటానికి వీలుకాదు కదా! కనుక పెద్ద మార్కులు తెప్పించుకున్న subject గాని తక్కువ మార్కులు వచ్చిన subject వారు వీరంతా కలిసి దీనికి కారణాలేవో గుర్తించటానికి



srisathyasaivachanamrutam

వీలవుతుంది. కనుక యీ కమిటీలో చాలా పని చేయవలసిన అవసరం వుంటుంది.

మూడవది Academic Committee. ఈ కమిటీ Instituteకు heart వంటిది. మిగతా Universityలలో యీ కమిటీలో వుండే అల్లర్లు ఇంకెక్కడాకూడా వుండవు. అక్కడంతా టేబుల్సు, టేబుల్సు పోట్లాడుకుంటూ వుంటాయి. ఈ కమిటీలో అన్ని రకముల సమస్యలను అక్కడ చర్చించటానికి మనం ప్రయత్నం చేయాలి. ఇందులో Deans, Professors, Vice Chancellor వుండాలి. వీళ్లందరుకూడను తమలో తాము సంప్రదించుకుని next yearలో యేం చెయ్యాలి? ఏవిధముగా పరీక్ష పేపర్లు తయారు చేయాలని విచారించాలి. కొంతమంది టీచర్సు యేమి చేస్తున్నారంటే last year question పేపర్లే యిచ్చేస్తున్నారు. ఇది కేవలం టీచర్సులో వుండే laziness. ఈ question bank లో దండిగా ప్రశ్నలు తయారుచేసుకోవాలి. మనం ఒక్కతూరి యిచ్చినవి మరొక్కతూరి యివ్వకుండా చూసుకోవాలి. last year యేమిచ్చాము, యీ year యేమియిస్తున్నాము అనే తారతమ్యంకూడా చూసుకుంటూ రావాలి. ఇది ఒక సేవగా మనం భావించాలి. ఇదేదో మనం చేయవలసిన duty అనే భావంతో చేయకూడదు. ఇది స్వామిసేవ అనే భావములో చేయాలి. నీకూ తృప్తి, పిల్లలకు తృప్తి, స్వామికి తృప్తి. కనుక యీ విధమైన సమభావముతో, శాంత భావముతో, విశాల భావముతో యీ కమిటీలో పని మనం చేయాలి. ఇక్కడ కొంతమంది Professorsకూడను చక్కగా విచారణ చేయాలి. ఈ Professors గాని Lecturers గాని Deans గాని మనం యే స్థానములో వుంటున్నాము, యే స్థానమునుండి మనం దీనిని యే విధముగా తయారు చెయ్యాలనే విషయాన్ని మీరు చక్కగా విచారణ చెయ్యాలి. కనుక అప్పుడప్పుడు వీరు అందరు మీటింగు పెట్టుకొని ముందుముందు మనమేరీతిగా చేయాలనే విషయాలను చర్చించుకోవాలి.

### మన Institute విషయంలో డబ్బు ఖర్చుకు యేమాత్రం వెనుకంజ వేయము

అధ్యాపకులారా! మీరు వేరుగా భావించరాదు. మేము డబ్బు విషయములో యేమాత్రంకూడను వెనుకంజ వేయము. ఎన్ని లక్షలైనా, ఎన్ని కోట్లైనా మేము యివ్వటానికి సిద్ధముగా వున్నాము. నిజముగా మేము డబ్బుకు ఆశ పడే వారమవుతే విద్యార్థులనుండి

sri sathyasaivachanamrutam

యెందుకు ఫీజు కలెక్టు చేయటంలేదు? గవర్నమెంటునుండి యెందుకు జీతాలకొరకు గ్రాంట్సు తీసుకోవటం లేదు? ఒక్కపైసా UGC గాని గవర్నమెంటుగాని సహాయం యివ్వటంలేదు. అంతా ట్రస్టు తరపునే యిస్తున్నాము. పిల్లలనుండి మేము నయాపైసాకూడా ఫీజు తీసుకోటంలేదు. అంతాకూడా ట్రస్టే యిస్తోంది. ఇది డబ్బు ఆశతో కాదు. మీరనుకుంటారు, డబ్బు యివ్వటంలేదే అనుకుంటారు. కాని Professors వుండవలసిన స్థానంలో మీరు వుండటంలేదు. అందువలననే మీకు కొన్ని యిబ్బందులు కలుగుతున్నాయి. అడగవలసిన రీతిగా మీరు అడగాలి. Physics Professor వస్తాడు, మాకు నాలుగు లక్షలు కావాలి; Chemistry Professor వస్తాడు, మాకు మూడు లక్షలు కావాలి; MBA Professor వస్తాడు, మాకు ఐదు లక్షలు కావాలంటాడు. నిజమే అడగవచ్చు. కానీ మేము యెలా అంటే అలా యివ్వటానికి వీలవుతుందా? నీవు proposal తీసుకురా. తప్పక మేము యిస్తాము. మనం ఎలా అడగాలి, దేనికి దేనికి యెంతెంత అనేది ఖచ్చితంగా మీరు మీటింగు పెట్టుకొని అంచనా వ్రాసుకొని తీసుకువస్తే బావుంటుంది. నాకు నాలుగు లక్షలు కావాలంటే మేమలా యివ్వటానికి వీలుకాదు. మీరు యేదేది దేనికి కావాలని proposal తీసుకురండి, తప్పక మేము యిస్తాము. ఇది Professors యొక్క బాధ్యత క్రింద వుండాలి. కాని ఆవిధంగా జరగటం లేదు. మీ proposal సరిగా వుండదు. దేనికేది కావాలో మీటింగు పెట్టుకోరు. ఒక కమిటీ నిర్ణయం చేసుకోటంలేదు. మాకు ఐదు లక్షలు, నాలుగు లక్షలు కావాలంటారు. ఇది యేమైనా మార్కెట్ అనుకున్నారా లేక మార్వాడి యిల్లనుకున్నారా? ఆ డిపార్టుమెంటు అంతా కలుసుకోండి నీకేదేది కావాలి నీకేదేది కావాలి అని అంతా ఒక ప్రపోజల్ తయారుచేయండి. దానిపైన ఫలానా దానికి యింత డబ్బు. ఫలానా దానికి యింత డబ్బు అని వ్రాసుకొని తీసుకురండి. నిముషంలో మేము డబ్బు యిస్తాము. ఇవన్నీ యేమై పోయిందంటే, పూర్వము ఆ గవర్నమెంటు కాలేజీల్లో అక్కడా యిక్కడా చేసిన అభ్యాసాలు యీ రకంగా వస్తున్నాయి. కాని, ఆ అభ్యాసమునకు యీ అభ్యాసమునకు చాలా వ్యత్యాసముంది. అక్కడెవరూ అడిగే దిక్కులేదు. వాళ్లకంత interest వుండదు. కానీ మాకు చాలా interest వుంది. ఈ పొద్దు వుండవచ్చు. రేపు పోవచ్చు టీచర్సు. కానీ, మేము శాశ్వతంగా వుండేవాళ్లము. మేము దీనిని అభివృద్ధి గావించుకుంటూ

పోవాలి. మా department కు యిదిలేదు, అదిలేదు అని చెప్పుకోటం చాలా అవమానకరం. ఆ విధముగా చెప్పకూడదు. మీరు proposal యివ్వండి. మేము యిస్తాము. proposal లేకుండా ఒక్క నయాపైసా అయినా యివ్వటానికి వీలుండదు. మీరు వుండేది దేనికోసం? మీరు proposal యెందుకు తయారు చేయకూడదు? మీకు యెందుకు జీతాలిచ్చేది? మీ duty మీరు చక్కగా చేయాలి. కనుకనే యీ విధమైన కమిటీలంతా పెట్టుకొని దీనిని సరైన రీతిలో చేస్తే యెంత ఆదర్శవంతమైన రీతిగా వుంటుంది, మన Institute! డబ్బుకోసం మీరేమాత్రము విచారించనక్కరలేదు. ఎన్ని లక్షలు కావలసినా యివ్వటానికి సిద్ధముగా వున్నాను. కాని, సరైన రీతిలో మీరు అడగాలి. సరైన రీతిలో మీరు తీసుకోవాలి. ఎవరంటే వారు స్వతంత్రముగా యేదానికంటే ఆదానికంతా orders యివ్వకూడదు. మీరందరు మీటింగు పెట్టుకొని యేది కావాలో చూచుకొని ఒక్కతూరి యివ్వండి. అన్నీ ఒక్కతూరి తెప్పించవచ్చును. ఒక ప్రొఫెసర్ ఒకటి అడుగుతే, యింకో డీన్ యింకొకటి అడిగితే యింకో lecturer యింకొకటి అడుగుతే ఏ విధముగా తెచ్చిపెట్టేది? దానికి, దీనికి సంబంధం వుండాలి కదా! అన్నీ ఒక్కతూరి మనకు లభించే మార్గంలో మీరు చక్కగా plan వేసియివ్వండి. యీ academic committee లోపల యీ విషయాలన్నీ చర్చించాలి. ఏది చేసినా కాని, పిల్లలయొక్క అభ్యున్నతినే తగిన లక్ష్యంగా పెట్టుకోవాలి. దానికి తగిన రీతిలో నడచుకోవాలి. మనకు Rightsతోపాటు Responsibilitiesకూడా వుంటున్నాయి. ఈ రెండూ రెండు పాదములవలె నడవాలి. రైలు రెండు పట్టాలపైన నడచినప్పుడే యిది సక్రమంగా క్షేమంగా నడుస్తుంది.

నాల్గవది లైబ్రరీ కమిటీ. ఈ లైబ్రరీ కమిటీలోపల కొంతవరకును, ఏది మనకు useful, ఏది useless ఏది మనకు అవసరము? ఏది మనకు అనవసరము? ఇవన్నీ బాగా చర్చించి నిర్ణయం తీసుకోవాలి. ఇప్పుడు foreign నుండి 120 మాగజైన్సు వస్తున్నాయి. మన ఇండియా నుండి 80 మాగజైన్సు వస్తున్నాయి. ఈ మాగజైన్సు అంతా పిల్లలకేమైనా సహాయంగా వుంటున్నాయా, లేదా? టీచర్సుకు యేమైనా వుపయోగంగా వున్నాయా, లేదా? వుపయోగంగా వుండేవి యెన్నైనా తీసుకోండి, సంతోషమే! అవసరంకానివి తీసుకొని దీనివల్ల మనం యెంత నష్టపడతాము? కనుక, మీరు అందరూ చేరి చర్చించుకుని

sri sathyasai vahini

మనకేది అవసరమో అవి మాత్రం తీసుకోండి. ఎందుకంటే, నా స్వభావము అలాంటిది. ఏ ఒక్క చిన్న దానిలోనైనా waste చేయటం నాకిష్టంలేదు. నేను యెప్పుడు perfect. ఒక చిన్న విషయం చూడండి. ఒక టంబ్లరు వుంది. రాధాకృష్ణకుకూడా తెలుసు. నేను ఒకతూరి నీళ్లు తాగుతాను, త్రాగినాక మిగిలిన నీళ్లుంటాయి. ఈ మిగిలిన నీళ్లను నేను పారపోయను. ఎందుకంటే, యీ పారపోయటం waste అని దాన్ని అలానే వుంచి మూతపెట్టి యింకోతూరి త్రాగుతాను. ఒక్క నీళ్లే కాదు. కరెంటుగాని, యింకేవిధమైన పదార్థంకాని ఏదీ కూడ నేను waste చేయను. అందుకే మీకుకూడా చెబుతున్నాను. ధనముకూడా waste చేయకూడదు. ఈ పవిత్రమైన ధనమును మనము దుర్వినియోగము చేయటము మహాపాతకము. Misuse of money is evil. దానిని దుర్వినియోగము చేయకుండా మీకు అవసరం వచ్చినప్పుడు తీసుకోండి. తప్పక మీరు ఆనందాన్ని అనుభవించవచ్చు. Institute కి మంచి పేరు వస్తుంది. ఇంకా లైబ్రరీకి కొన్ని పుస్తకాలు కావాలి. మీరు అనుకోవచ్చు, ‘UGC యిస్తోందికదా ఐదు లక్షలు, పది లక్షలు’ అని. UGC అయితేనేమి, యెవరైతేనేమి, యెవరిచ్చినా usefulగా వుపయోగపెట్టుకోవాలి గాని uselessగా వుపయోగపెట్టకూడదు. మిగతా universityలలో UGC నుండి వచ్చింది కదా అని యిష్టం వచ్చినట్లు చూచిన books అన్నీ కొనటం, లైబ్రరీ పెద్దగా చేసుకోటం జరుగుతూంటుంది. వీనిలో పనికి వచ్చేది యేమిటి అని చూడటంలేదు. అవసరమైనవన్నీ మనము తీసుకోవలసిందే, తప్పులేదు. కనుక, ఆయా సబ్జక్టులకు కావలసిన books అన్నీ మీరు తీసుకోండి, తప్పు లేదు.

**“బీదలను చూస్తే జాలి జేబులు ఖాళీ”**

ఇంకా కొన్ని విషయములు మీరు చక్కగా గుర్తించాలి. ఒక Ph.d guide, ఒక Ph.d student వారికి యిష్టం వచ్చిన subject పైన వారు Ph.d లు చేస్తున్నారు. జగత్తులో యేదో ఒక subject తీసుకొని దానిపైన వ్రాస్తుంటారు. ఆ subject యీ Guide కి తెలీదు. పాపం ఏదో రిసెర్చి చేస్తున్నారు కదా అని వాళ్లు వ్రాసింది వప్పుకొని థీసిస్‌పైన సైన్ పెడుతుంటాడు. ఈ విధముగా Ph.d students తాలూకు వందలు, వందలు books



srisathyasaivacharamrutam

సంవత్సారానికంతా తయారవుతున్నాయి. ఇంకా యిందులో యెలా వుందంటే, వాడు వ్రాసింది యింకొకరు తప్పని, యింకొకరు Ph.d థీసిస్ వ్రాస్తాడు. ఇవన్నీ చూస్తే ఒక్కటికూడను పనికొచ్చేవి వుండవు అక్కడ. ఈ వందల పుస్తకాలు మనం తీసుకోనక్కరలేదు. Important books మనం తీసుకుందాము. అన్నింటినీ క్రోడీకరించి అవసరమైన వాటిని మనం తీసుకుందాము. దానితో మనం పని చేసుకోవచ్చు. ప్రతీ book తీసుకోటం, దానిలో వున్నదే దీనిలో వుంటుంది. రెండూ ఒక్కటిగానే వుంటాయి. ఇలాంటి books మనం తీసుకొని డబ్బు, సమయం waste చేయకూడదు. లైబ్రరీలో దండిగా books వుంటున్నాయి. యేమి ప్రయోజనము? ఇది ఎలా వుందంటే, ఒక సామెత వుంది-బీదలను చూస్తే జాలి జేబులు ఖాళీ'. మనకు యేదో books పైన ఆశ వుంటుంది గాని books లో చూస్తే యేమీ వుండదు. కనుక, పనికొచ్చే books కొన్ని వేలు వున్నా మనకి చాలు. పనికి రాని పుస్తకాలు లక్షలుంటే యేమిప్రయోజనము? లైబ్రరీ చూచి 'అబ్బా! యెంత పెద్ద లైబ్రరీ. ఎంత పెద్దది', అంటారు. యిది వాళ్ల తృప్తి. వాళ్లను తృప్తి చేయటానికికాదు మనం ప్రయత్నించవలసింది. కావలసినది, మనతృప్తి. self satisfaction అవసరం. అసలు యీ books అన్నీ చదువుతున్నారా లేదా అనేదికూడా గుర్తించటంలేదు. కనుక మన Professors అంతా యెంత డబ్బు ఖర్చైనా సరే మీకవసరమైన books తెచ్చుకోండి. వాటి లిస్టు ముందుగా తయారుచేసుకోండి. ఏవి మనదగ్గర వున్నాయి. ఏవి మనదగ్గర లేవు. ఈ రెండింటిని విచారించి మీకు కావలసినవి తెచ్చుకోండి. యిది ఒకరిద్దరు చేయటానికి వీలుకాదు. ఒక ఐదారుమంది చేరి దీనికికూడ ఒక సరైన మార్గాన్ని నిర్ణయించుకున్నప్పుడే పిల్లలకు మంచి అభివృద్ధి వస్తుంది. అన్ని విధాలా idealగా వుంటుంది. కనుక లైబ్రరీకమిటి ఒకటి తప్పకవుండాలి.

**ఆటలాడేది మన ఆనందము, ఆరోగ్యములకొరకు**

ఇంక sports and cultural activities. యీ రెండింటికి చేరి ఒకే కమిటీ వుంది. ఇక్కడ మన పిల్లలు చక్కగా గుర్తించాలి. ఆటలెందుకుపెట్టారు? 'పరులపైన పోటీపడి వారిని ఓడించాలి, మనం జయించాలి', అనే దుర్భావములు మనలో రాకూడదు. మిగిలిన చోట్ల

srisathyasaivachanamrutam

sports యెక్కువ encourage చేస్తుంటారు. ఎందుకంటే మా college student sportsలో జగత్ ప్రఖ్యాతి పొందినాడంటే ఆ కాలేజీకి అదొక గొప్ప విలువ. అలాంటి పేర్లు మనకు అక్కరలేదు. ఇది కేవలం ఒక business typeలో పోతోంది. ఆటలాడేది మనందరి కోసం. మన ఆనందంకోసం, ఆరోగ్యంకోసం. ఈ ఆనందం మనం అనుభవించాలి. ఆరోగ్యాన్ని పొందాలి. దీనిలో ఒకరితో ఒకరు పోటీలు పడి ద్వేషాలతో యీ పోటీలలో జయించరాదు. ఎప్పుడైతే పోటీ పడతారో అప్పుడు difference వస్తుంది. ఈ విధమైన కాంపిటీషన్ మాత్రం వుండకూడదు. ఈ ఆరోగ్యనిమిత్తమై మనము యేమేమి చెయ్యాలి, యే ఆటలాడించాలనేది వారు నిర్ణయము చేసుకొని యీ ఆటలకే యే సామానులు కావాలి, indoor gamesకి యేమేమి కావాలి అని కమిటీలో మీరు చర్చించి లిష్టు తయారుచేసుకోవాలి. పిల్లలకు ఆటలు చాలా అవసరం. లేకపోతే తిని కూర్చుంటే యింక ఏమీ పని చేయలేరు. "ఉడిపి కృష్ణా! కడుపు బరువు యెత్తలేను, యేమి చేతు" అనెనట! ఈ కడుపు భారం అయిపోతే యింక యే విధముగా పని చేయగలరు? చదువుకూడా చదవలేరు. అందువలన ప్రతి విద్యార్థికూడను ఆటలలో పాల్గొనాలి. కనుక, దీనికి తగిన ఒక కమిటీని చక్కగా నిర్ణయముచేసి తద్వారా regularగా జరిగేటట్లుగా చూసుకోవాలి.

**నాకు తెలియనిది ఈ జగత్తులో ఒక్కటికూడా లేదు**

ఇంక ఆరవది Hostel Committee. ఈ హాస్టలులోకూడను ఒక కమిటీ వుండాలి. పిల్లలు అధికముగా వుండటంచేత చూసుకునే వాళ్లకుకూడను చేతకాకుండా పోతుంది. ఒక చిన్న ఉదాహరణము. మన పిల్లలందరు 100% యీ హాస్టలులోనే వున్నారు. అలాంటి సమయములోపల వాళ్ళకి యేమైనా రోగం వచ్చినా, దెబ్బతగిలినా, యింకేమైనా అననుకూలం జరిగినా వాళ్ళు Instituteకి రాకుండా వుండటానికి ఒక కారణము వుంటుంది. ఏ జబ్బులేక, ఏ రోగములేక, ఏ నొప్పిలేక, ఏ కారణములేకుండా instituteకి రాకుండా వుండటానికి కారణంయేమిటి? చాలమంది పిల్లలు absentగా వుంటున్నారు. మీరనుకోవచ్చును. సాయిబాబా యెక్కడో వుంటాడు, ఎక్కడో తిరుగుతూవుంటాడు, ఏదో భక్తులను చూస్తూ వుంటాడని. లేదు లేదు. ప్రతి చిన్న విషయాన్ని నేను watch చేస్తున్నాను.

sri sathyasai vachanamrutam

'Educationకి సంబంధించినది సాయిబాబాకు తెలియదు', అని మీరు అనుకోవచ్చు. నేను అహంకారంగా చెపుతున్నదికాదు. నాకు తెలియనిది యీ జగత్తులో ఒక్కటి కూడాలేదు. అదే Awareness of Life. కొంతమంది పిల్లలు తినటము, సరిగ్గా యీ పిల్లలు అంతా లైనులో వచ్చేటప్పటికి, లోపల బోల్టు వేసుకోటం నిద్రపోటం. ఎంతవరకు attendance వుండాలో, అంతకంటే యెక్కువ వాళ్లు వుపయోగపెట్టుకున్నారు లీవులు. ఇక్కడ ప్రతి టీచరుకూడను వాళ్ల క్లాసులో ఆ పిల్లలు వచ్చారా లేదా చూడాలి. నా వుద్దేశ్యం, మరొకటి నూతనంగా మనము చేయవచ్చును. మొట్టమొదట prayer timeలో attendance తీసుకోవాలి. కొంతమంది పిల్లలు యీ attendance తీసుకోగానే వెళ్లిపోతారు. కాదు, కాదు. ప్రతి పిల్లవానిని watch చెయ్యాలి. అక్కడ Hostelలో అన్నిరూములు check చెయ్యాలి. పిల్లలు వారికి తెలియకపోవచ్చును. కాని పెద్దవారికి యింతకన్న పనేముంది? పిల్లలు సరైన ప్రవర్తనతో, సరైన నడతతో, సరైన రీతిలో కాలేజీకి రావటము, పాఠాలు చూసుకోటము, నేర్చుకోటము యీ విధముగా చేస్తున్నారా, లేదా అని చూడాలి.

**హాస్టలులో పిల్లల ఆరోగ్యము, ఆహారము, నిశ్శబ్దత చూసుకునే కమిటీ ఉండాలి**

విద్యార్థులారా! మీరుకూడను కొన్ని గమనించవలసినవి వున్నవి. మాకు grade రావటం, marks రావటం ప్రధానమని తలచకూడదు. చదువులో ఏ '0' grade నీవు తెచ్చుకున్నావో, నీ ప్రవర్తనలోకూడ '0' grade వుండాలి. చదువు అనేది యేదో grade తెచ్చుకొని certificate తీసుకొని పోయి, బజారుల వెంట తిరిగి భిక్షమెత్తుకోటం కాదు, మనకు. ప్రవర్తన సరిలేకుండా పోయినప్పుడు, తమ కర్తవ్యాన్ని తాము చక్కగా గుర్తించలేనప్పుడు M.A. చదివినా, భిక్షమెత్తుకున్నా వానికి భిక్షంకూడా వేయరు. యెందుకంటే, 'దున్నపోతులావున్నావు పనిచేసుకోకూడదా? నీ కెందుకు భిక్షం?' అని అడుగుతారు. కనుక, యీ డిగ్రీలతోకాదు మనం వుండేది. మంచి నడతలతో వుండాలి. మంచి నడవడి పెంచుకోవాలి. బాగా పనిచేయాలి. మనం సాధనతో దీనిని సాధించవచ్చును. Practice makes a man perfect అన్నారు. కనుక, మనము practice చేయాలి, ఆ విధముగా. ఈ వయసు చాలా విలువైనది. ఈ విలువను మనము

srisathyasaivedamrutam

పాడుచేసుకుంటే తిరిగి మన జీవితంలో లభించదు. ఇంతప్రేమతో, యిన్ని విధములుగా, చిన్న చిన్న విషయాలలోకూడను శ్రద్ధ తీసుకొని చెప్పేవారు యెవరు మీకు లేకపోటంచేతనే మీరీ విధమైన పరిస్థితిలో వుంటున్నారు. మనము యీ విధముగా మన Hostelలోకూడను ఒక కమిటీని పెట్టుకొని పిల్లలకు అవసరమైన food సరైన రీతిలో యిస్తున్నారా లేదా? యిది యేరకముగా వుంటున్నాది అని చూచుకోటానికి ఒకరువుండాలి. Food లోపల శుచి, రుచి అవసరం. ఏదో చేసినారు కదా, తట్టలో వేసినారు కదా అని మనం పొట్టలో వేసుకుందాం అని ఆ రకంగా పోకూడదు. దానికి తగిన రుచినికూడా అందించాలి. పిల్లలకు జిహ్వాచాపల్యం వుందికదా! కనుక, వారికి సరైన food యివ్వాలి. ఎందుకంటే డబ్బుకడుతున్నారు. డబ్బుకట్టే సమయంలో వారికి మంచి food యివ్వాలి. యీ కమిటీవారు యేమి చెయ్యాలంటే 'యిది పొట్టలోకి వేసే పదార్థముగాని బుట్టలోకి వేసేది కాదు, దీనిని చక్కగా పెట్టాలి' అనే భావాన్ని పెంచుకోవాలి. ఇంతేకాకుండా యీ Hostelలో silence చాలా అవసరం. దీనిని ముందుగా మనము అభివృద్ధి చేసుకోవాలి. ఒక చిన్న ఉదాహరణము. అక్కడ వుండేవాళ్లు చెప్పవచ్చును. అబ్బా! చాలా సైలెంటుగా వున్నారని చెప్పవచ్చు. ఇది సైలెన్సు కాదు, కేవలం ఒక విధమైన చెవిటితనము. మార్కెట్టులోకి మనం వెడితే ఒకరు మాట్లేదేది మరొకరికి యేమీ వినపడదు. అంతా confusionగా వుంటుంది. కాని, మార్కెట్‌కి కొంతదూరంగా పోయిచూస్తే అప్పుడు అక్కడ యెలావుందో తెలుస్తుంది. ఆ రూములో ఆ రూములో వాళ్లు బాగున్నట్లుగా కనుపిస్తారు, చిన్నగా మాట్లాడుతూ. కాని, బయటకొస్తే యివన్నీ కలసి పెద్ద శబ్దం అవుతుంది, లౌడ్ స్పీకరు మాదిరి. కనుక Health, food, silence యీ మూడింటిని చూచుకునేవారు ఒకరుండాలి. ఇప్పుడుకూడా వున్నారు. పాపం యేమి ప్రయోజనం! 'వున్నాడమ్మా మా పిల్లవాడు దండులో', అన్నాడట! అంటే మిలట్రీలో అని. ఏం చేస్తున్నాడంటే 'చచ్చిన వాళ్లని యీడ్చి పారేస్తున్నాడుట! war లో వుండి యుద్ధంచేయాలి, వాడు వీరుడు. కాని కొంత మంది సిపాయిలు వుంటారు. చచ్చినవాళ్లని యీడ్చుటం, పూడ్చిపెట్టటం, తలలుగొరగటం, యివన్నీ చేస్తారు. ఇవన్నీ సైన్యంలో వుండి చేసేపనా? పాపం కొంతమందికి మెడికల్ సంబంధమై తెలియదు. ఏజబ్బుకి యే మందివ్వాలో తెలియని సమయంలో వారిని హాస్పిటల్‌కు తీసుకుపోయి డాక్టరుకి

sri sathyasai vachanamrutam

చూపించాలి. ఈ health విషయంలో చాలా carefulగా వుండాలి. ఎప్పటికప్పుడు చూచుకోవాలి. కొంచెం లేటయితే వేరే ప్రమాదమేమైనా జరుగవచ్చు. కనుక యీ Hostelలో పిల్లల ప్రవర్తన బట్టి, పిల్లల silenceను బట్టి, పిల్లల healthను బట్టి పిల్లలను చూచుకోటానికి ఇక ఐదారుమంది ఒక కమిటీగా వుండాలి.

Department committee అనేది ప్రతినెలా 1st sunday meeting పెట్టుకోవాలి. ఈ Facaulty committee వారు ప్రతి 2 monthsకి second sunday మీటింగు పెట్టుకోవాలి. ఈ Academic committee అనేది మూడునెలలకొకసారి meet అవాలి. అదికూడను ఒక sunday పెట్టుకోవచ్చును. ఇంక Games, Hostel, Library మటుకు ప్రతి పదహైదు దినాలకి ఒకతూరి చూసుకోవాలి. ఎందుకంటే కొన్ని కొన్ని subjects అంతా మారుతుంటాయి. కొత్త పిల్లలకి అవసరమైనవి చక్కగా అందించాలి. తరువాత పిల్లలు చక్కగా చదువుతున్నారా? ఏ books చదువుతున్నారు. Novels చదువుతున్నారా subjects చదువుతున్నారా? కొంతమంది పిల్లలుంటారు. పెద్ద subject book తీసుకోని దాని మధ్యలో novel పెట్టుకొని చదువుతూవుంటారు. ఇలాంటి చదువులలో మన పిల్లలను ప్రవేశపెట్టకూడదు. లైబ్రరీ చూచే అధికారులుకూడా యీ పిల్లలు యేమేమి చదువుతున్నారని వాచ్ చెయ్యాలి. ఇది చాలా పెద్ద పనేకాని ఒక్కరికి కాదు. Professors గాని Lecturers గాని Readers గాని యెవరికైనా యిది చాలా పెద్ద పనే. కాని యిది ఒక సేవగా మీరు భావించి చేయాలి. ఇది ఒక పెద్ద సాధనగా మీరు విశ్వసించాలి. నిజముగా యింతమంది పిల్లలను బాగుచేయటమంటే యెంత గొప్ప ఫలితమో! ఇలా చేస్తే మీరు ఎంతో గొప్ప అనుగ్రహాన్ని పొందిన వారౌతారు. మన విద్యార్థులు ఆదర్శవంతమైన విద్యార్థులుగా తయారుకావాలి.

**నిశ్శబ్దములోని శబ్దమే బ్రహ్మము**

విద్యార్థులారా! మీ రూములలోపల మీ మానిటర్సుకూడా వుంటున్నారు. వాళ్ళూ పిల్లలే! పిల్లలు, పిల్లలతో చేరిపోతున్నట్టుగా వుంటున్నారు. కానీ మీరు ఒకరు చెప్పకుండా మీకు మీరే సక్రమంగా నడచుకొనేశక్తి, స్వశక్తి తెచ్చుకొనేందుకు ప్రయత్నం చేయండి. తరువాత

sri sathyasai vahanamrutam

విచారించి ప్రయోజనంలేదు. తిరిగి యిలాంటి అవకాశము మీకు చిక్కుతుందని కలలోకూడ అనుకోకండి. ఈ చిక్కిన చక్కని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. Hostelలో గాని, Instituteలో గాని, ప్రశాంతినిలయంలో గాని మీ discipline చక్కగా స్టెడీగా కూర్చోటంలో యేకంచేయాలి. భజనలు, వుపన్యాసాలు చేసే సమయములో మీరు ఏ మాత్రం అలజడులను పుట్టించకూడదు. ఇది ఆరునెలలనుండి ప్రారంభమైంది. విద్యార్థిదశ జీవితంలో ప్రధానమైన ఘట్టంగా మీరు భావించుకోవాలి. ఈ రూమ్సులోపల ఒకరికొకరు యే విధమైన పోట్లాటగాని, ద్వేషముతో కొన్ని విధములైన పదములను వుపయోగ పెట్టడంగాని చేయకూడదు. పది దినములకు ముందు ఒక రూములో అలా జరిగింది. ఒక పిల్లవాడు యింకో పిల్లవానిని కొట్టాడు. ఇలాంటివి మన Hostelలో జరుగవచ్చునా? ఇలాంటివి జరిగినప్పుడు దీనిపైన యెందుకు చర్య తీసుకోలేదు? ఈ విధముగా మనం తాత్సారం చేయబట్టే ఇవి మరింతగా పెరిగిపోతుంటాయి. ఇనుము యెఱ్ఱగా కాలినప్పుడే సుత్తిదెబ్బ వేస్తే యెంతవరకైనా సాగుతుంది. అది చల్లబడ్డాక యెవరు కొట్టినా సాగదు. అప్పుడు ఒక పిల్లవానికి తగిన punishment యిచ్చివుంటే యింకో పిల్లవాడు ఆ తప్పు చేయకుండా వుంటాడు. ఇది దయ కాదు. సోంబేరితనముయొక్క లక్షణము. ఇది సదభ్యాసాన్ని అభివృద్ధి చేయటంకాదు. దురభ్యాసాన్ని అభివృద్ధి చేయటం. పిల్లలమీద దయ నాకు లేదా? నాకు కావలసినంత దయ వుంది. అంతే కాదు, నాకు దయ కలిగిందంటే ప్రాణాన్నే యిస్తాను. కాని, తప్పుచేస్తే ప్రాణాన్ని అయినా తీస్తాను. ఎందుకంటే తప్పుచేయకూడదు. తప్పులేని జీవితంగా మనం తయారుకావాలి. ఏదో ఒక్కతూరి చేస్తే క్షమాపణ. ఎప్పుడూ దీనిని చేస్తుంటే ఒకరిని చూచి యింకా పదిమంది యిలాగే తయారౌతారు. ఆ విధముగా యిప్పుడు పెరిగిపోయారు. ఇకపైన యెప్పుడైనా గానీ, భజనలోగాని, ప్రార్థనలోగాని, ఉపన్యాసాల్లోగాని, బయట అటూయిటూ తిరగటం, అలక్ష్యముగా తీసుకోటం, దగ్గటం, తుమ్మటం యిది సరైనది కాదు. కొంచెం control చేసుకొనేందుకు యిది చక్కని అవకాశం. ఇలాంటి అవకాశమున్నప్పుడు మీరు అలక్ష్యముగా కోతులవలె ప్రవర్తించటం మంచిది కాదు. యింకపైన యీ విధముగా జరుగుతే క్షణముకూడా మిమ్మల్ని మేము Hostelలో గాని, Instituteలో గాని పెట్టుకోము. ఇంక

sri sathyasai vaahini

జీవితంలో మిమ్మల్ని చూడము. కనుక మీరు జాగ్రత్తగా మెలగండి. Silence is God. ఈ silence లోనే వుంది నిజమైన దైవము. బయట శబ్దములోపలకూడ నిశ్శబ్దము వుండాది. నిశ్శబ్దములోని శబ్దమే బ్రహ్మము అన్నారు. ఈ శబ్దములో పవిత్రమైన దివ్యత్వమును అభివృద్ధి చేసుకోవచ్చు. ఈ silence యేమి చేస్తుందంటే మిగతావారికి కూడా help చేస్తుంది. మీరు దీనికి విరుద్ధంగా నడిస్తే మిగతావారికికూడా harm చేసినవాళ్లవుతారు.

**అహంకారమనేది మానవుని అథఃపతనము గావిస్తుంది**

కనుక, మనం యికపైన silence చాలా develop చేసుకోవాలి. మనసునందు ఒక విధమైన యేకాగ్రత అభివృద్ధిపరచుకోవాలి. మనయొక్క మలమును, విక్షేపాన్ని, ఆవరణమును క్రమక్రమేణా తొలగించుకోటానికి మనము ప్రయత్నించాలి. నీ కడుపులో మలమెంతకాలమైనా వుంటే నీవు బ్రతకగలవా? వీలుకాదు. మొట్టమొదట దానిని బయటకు పంపాలి. అదే విధముగా నీలో వుండే దుర్భావములు నీలో వుంటుంటే యెప్పటికైనా అది నిన్ను వంచింపచేస్తుంది. కనుక పిల్లలందరు సత్యవాక్కులోపల, వినయములోపల, విధేయతలోపల నిజమైన subjectగా మీరు తయారుచేసుకోవాలి. ఏదైనా మనము అడగవలసినా కాని, చెప్పవలసినాగాని వినయంగా మనము అడగాలి, వినయంగా చెప్పాలి. ఈ అహంకారమనేది మానవుని అథఃపతనము చేస్తుంది. ఈ అహంకారమనేది టీచర్సుయందుగాని, పిల్లలయందుగాని యెవరియందు వుండకూడదు. ప్రతిఒక్కరుకూడను ఒక పవిత్రమైన రీతిగా మాట్లాడాలి. ఎన్ని పర్యాయములో చెప్పాను. ఈనాడు అధ్యాపకులు, పిల్లలు మాత్రం వుండటంచేత మనలో వున్న పొరపాట్లు మనం చక్కగా తెలుసుకోగలిగాం. ఇప్పుడు తెలుసుకున్నారు కనుక రేపటినుండి యే విధమైన remarks రాకుండా వుండటానికి ప్రయత్నించండి. మీరు ఆదర్శవంతమైన విద్యార్థులుగా తయారుకండి. దేశానికి యెంతైనా మంచిపేరు ప్రతిష్ఠలు తెచ్చి సగౌరవంగా జీవితాన్ని శాంతిమయమైన జీవితంగా గడపుకోండి. మీరు artificialగా జీవిస్తేనే యింత గౌరవంగా వుందే, శాశ్వతంగా సత్యమైన జీవితంగా మీరు గడిపితే ఎంత గౌరవ ప్రతిష్ఠలందుకుంటారు! ఒక చిన్న కథ జ్ఞాపకం వస్తుంది. కొద్ది సేపట్లో ముగిస్తాను.

srisathyasaivachanamrutam

ఎక్కువటైమ్ తీసుకున్నాను.

**దర్శనం పాపనాశనం, సంభాషణం సంకటనాశనం, స్పర్శనం కర్మవిమోచనం**

కృష్ణచైతన్యుడు తాను నృత్యంచేస్తూ తన్మయముతో వున్మత్తునివలె తాను ఒక విధమైన దైవత్వముయొక్క తాదాత్మ్యభావంలో లీనమైపోతున్నాడు. నవద్వీపపురమనే దానిలో ప్రవేశించాడు. అక్కడ రాజులు పెద్దపెద్ద వాళ్లందరు యీ కృష్ణ చైతన్యుడు చేస్తున్న భజనచూచి వారుకూడా తన్మయులై పోయారు. వారుకూడా యీ భజనలో ప్రవేశించి వారికిరీటాలు క్రిందపడేటట్లుగా ఎగురుతున్నారు. ఈ యొక్క తన్మయత్వములోపల ఒక దొంగ రాముడనేవాడు ప్రవేశించాడు. వాడు జీవితమంతా దొంగతనము చేయటం, అబద్ధాలాడటం, ఇదే వాడిపని. వాడుకూడా అందులో వచ్చి నాటకమాడుతాడు. వాడు యెందుకోసం యీ పెద్దవారితో వచ్చి నాటకమాడాడు? ఈ పెద్దపెద్ద రాజులంతా ఆటల్లో మైమరచివుంటారు. నేనుకూడ వారితో ఆడుతూ వాళ్ల జేబుల్లోది మెత్తగా కొట్టేయవచ్చుకదా అనుకున్నాడు. కాని, వాని అదృష్టము-వాడు తలచుకున్నది ఒకటి అయితే, ఆజనంలో వచ్చి ఆడేటప్పటికి వాడుకూడను తన్మయుడై పోయాడు. వాడి దేహాన్నే వాడు మరచిపోయాడు. సరే! అందరు వెళ్లినాక వీడు కాచుకొని వున్నాడు. ఈ చైతన్యుడు కూర్చొని పదిమంది పిల్లలతో మాట్లాడుతున్న సమయములో పరిగెత్తి వచ్చి ఆయన పాదాలపైన పడ్డాడు. "స్వామీ! అందరికి వుపదేశం చేస్తున్నారు. నాకు యేదైనా ఒక నామం చెప్పండి", అన్నాడు. "నీవు యెవరో, నీచరిత్ర నాకు మొట్టమొదట చెప్పుమ"న్నాడు, యీ చైతన్యుడు. "స్వామీ! నేను దొంగను. నేను దొంగతనము, అసత్యముతోనే నా జీవితమంతా గడుపుతున్నాను. నా పేరు రాముడు అందరూ దొంగరాముడని పిలుస్తార"ని వున్నదున్నట్టుగా చెప్పుకున్నాడు. "అయితే నేను నీకు ఉపదేశమిస్తాను, గురుదక్షిణ యేమిస్తావు?" అన్నాడు, చైతన్య. "స్వామీ! నేను యేది దొంగతనం చేస్తానో దానిలో కొంత మీకిస్తాను", అన్నాడు. "నాయనా నాకది అక్కరలేదు. ఇక మీదట నీవు దొంగతనం చేయనని మాట యివ్వు అదే నాకు గురుదక్షిణ", అన్నాడు. "స్వామీ! ఏమైనా యిస్తాను గాని, ఆ మాటమాత్రం నేను యివ్వన"న్నాడు.

sri sathyasai vachanamrutam

"అయితే, పోనీ నీకు వుపదేశమిస్తాను. నీవు యెక్కడకు దొంగతనం చేయటానికి వెడతావో అక్కడ నేనిచ్చిన నామాన్ని 108 సార్లు జపించి తరువాత దొంగతనము చేయి" అన్నాడు. మెత్తగా దగ్గరకు పిల్చాడు. ఈ స్వామియొక్క సంభాషణతో వాని హృదయము చల్లబడింది. 'సంభాషణం సంకటనాశనం'. దీనితో భయం కొంతవరకు తీరింది. 'స్పర్శనం కర్మవిమోచనం'. దగ్గరకు పిలిచాడు వానిని. వాని తల పట్టుకున్నాడు. వాని చెవిదగ్గర నోరుపెట్టాడు. 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అని ఏకాదశ అక్షరమంత్రమును వుపదేశించాడు. ఈ స్పర్శలో కర్మవిమోచనం అయింది. 'దర్శనం పాపనాశనం. సంభాషణం సంకటనాశనం. స్పర్శనం కర్మవిమోచనం'. వెళ్లాడు వీడు. అందరు చైతన్యుని దగ్గరకు వస్తున్నారు. శ్రీమంతులుకూడా వస్తున్నారు. ఇది మంచి ఛాన్సురా అని అనుకున్నాడు. ఆ గ్రామములో వుండే మహాగొప్ప శ్రీమంతుడు, భార్యపిల్లలు అంతా బయలుదేరి వచ్చారు. అ సమయము చక్కగా చూసుకున్నాడు. వారి ఖజానాకోసం వెళ్లాడు. బీరువాలు తీసాడు. అన్నీ కనుపించాయి. వజ్రవైఢూర్యాలు మాణిక్యాలు అన్నీ కన్పించాయి. చూచాడు. తలుపుతెరిచాడు. కూర్చున్నాడు. 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే మంత్రం 108 సార్లు స్మరించాలి. అప్పుడుగాని అవి ముట్టటానికి లేదు. ఈ 108 అయ్యేలోపల యీయొక్క యజమాని, కుటుంబసభ్యులంతా దర్శనం ముగించుకొని యింటికి వచ్చారు. ఈ శ్రీమంతుని భార్య తన నగలన్నీ తీసి పెడతామని రూమ్‌లోకి పోయింది. కనుపించాడు యితను జపం చేస్తూ, 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అని. చూచింది యీమె. ఏ మహనీయుడో మా యింటిలో ప్రవేశించి నామం చేస్తున్నాడని వెళ్లి భర్తను పిలుచుకొచ్చింది. అయనా చూచాడు, 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనటం. వీరు ఎవరో మహనీయులు. మా అదృష్టం యినాటికి పండింది, అనుకొని వారంతా అతనికి పూజచేసి, నమస్కారముచేసి అనేక విధములుగా అతనిని గౌరవిస్తున్నారు. ఎందుకంటే "గ్రామంలోకి చైతన్యుడు వచ్చాడు. ఆయన దర్శనం కోసం వచ్చారేమో, జపం చేసుకోటానికి మా యింటికి ప్రవేశించారేమో" అని యీ రకముగా వుత్తమ భావాలంతా వారిలో వుప్పొంగుతూ వచ్చాయి. వీరు చేసేదంతా యీ దొంగచూచాడు. జపం అయిపోయి కన్నులు తెరచి చూసేటప్పటికి అందరూ నమస్కారాలు చేస్తున్నారు. శ్రీమంతుడు

sri sathyasai vahamrutam

నమస్కారంచేసి "తమరెవరండి, ఎక్కడనుండి వచ్చారు? తమరు మహానుభావులు. మా జన్మ సార్థకమైంది, యీనాడు. మా యింట్లో మీరు భోజనము చేసి, మా ఆతిధ్యం స్వీకరించి మమ్ములను ధన్యులను చేయాల"ని ప్రార్థించాడు. అప్పుడు అతనిలో ఒక గొప్ప పరివర్తన వచ్చింది. "నేను దొంగతనం కోసం వచ్చి యీ విధముగా నామస్మరణ చేస్తున్నాను. భగవన్నామ స్మరణవల్ల దొంగనైన నాకే యింత గౌరవం యిస్తున్నారే, నిజంగా నేను ఒక ఋషిగా తయారైపోతే యింక యెంత గౌరవాన్ని నేనందుకోవచ్చును. ఎంతవున్నత పదవిని పొందవచ్చును!" అని అనుకున్నాడు. ఛీ! యినాటినుండి నేనింక దొంగతనము మాని నిజమైన ఋషిగా తయారుకావాలని ఆ శ్రీమంతునికి నమస్కరించి, ఆమెకుకూడా నమస్కరించి 'అమ్మా నేనొక దొంగన'ని యథార్థము అంతా చెప్పుకున్నాడు. 'నన్ను వదలండి. నేను అడవికి వెళ్లి భగవత్ చింతనతో నా జన్మ సార్థకం చేసుకుంటాను. సత్యమైన ఋషిగా నేను తయారౌతాను', అని ప్రార్థించాడు. అప్పుడు వానిని ఒక పల్లకిలో వుంచి ఉత్సవము చేయించి అతనిని అడవిలో వదలిపెట్టారు. అతనుకూడా దారిలో చైతన్యునికి నమస్కారంచేసుకొని 'స్వామీ! నేను నిజమైన శిష్యునిగా అయ్యేటట్లు ఆశీర్వదించండి. ప్రపంచానికి నేను సేవ చేయవచ్చు. అలాంటి ఉన్నత స్థాయికి పోయేటట్లుగా అనుగ్రహించండి. ఈనాటినుండి యిక దొంగతనం మానుతాను' అన్నాడు.

అదే రీతిగా మనము బూటకముగా భజనలో కూర్చున్నా, నాటకంగా భజనలో కూర్చున్నా మనకు విద్యార్థులమనే గౌరవము వుంటున్నప్పుడు, నిజంగా మనము సత్యమైన విద్యార్థులుగా, నిత్యమైన విద్యార్థులుగా, సాయిప్రేమకు సంబంధించిన విద్యార్థులుగా తయారౌతే దేశమంతా మనలను గౌరవిస్తుంది. దేశానికంతా మీరు నాయకత్వం వహించవచ్చు. మీరు యెంతైనా గౌరవం పొందవచ్చు. కనుక మీరు నిజమైన భక్తులుగా, నిజమైన విద్యార్థులుగా తయారుకావాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ యీ మల, విక్షేప, ఆవరణలు పోగొట్టుకోటానికి ప్రయత్నం చేయాలని ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 12-02-1987న ఇన్‌స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam